
19.11.2000



# భయం




దీర్ఘాశి విజయభాస్కర్

**ఈమధ్య జరిగిన ఎలక్షన్స్‌లో గుంటెప్ప కౌన్సిలర్ అయ్యాడు.**

**ఎక్కడో పల్లెనుండి పూటగడవక పొట్ట చేతబట్టుకొని ఆ మున్సిపాల్టీకి వచ్చాడు. అప్పుడతను ఓ సెట్లర్. గత ఎలక్షన్స్‌లో అతనే డిసైడింగ్ ఫ్యాక్టర్. ఎలక్షన్స్ తర్వాత పెద్ద కాలువ ఎంక్రోచర్. తర్వాత చిన్న కాంట్రాక్టర్. ఆ తర్వాత మున్సిపల్ ఆఫీసుకి మీడియేటర్. ఇప్పుడు సాక్షాత్తు కౌన్సిలర్.**

ఇదీ ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతున్న తీరు.

నాలుగు ఓట్ల మెజార్టీతో గెల్చిన గుంటెప్ప ఒకరోజు తీవ్రంగా ఆలోచించాడు. "ఎంతమందికి బయ్‌లకి స్థలాలు ఇప్పించలేదు! ఎంతమందికి కొళాయిలు వెయ్యించలేదు! ఇంకెంతమందికి ఇంటి ప్లానులు సాంక్షను చెయ్యలేదు! ఎంతెంతమందికి ఆదరణలో సైకిళ్ళు ఇప్పించలేదు. అంతమందికి అన్ని ఉపకారాలు జేస్తే తన కొచ్చే మెజారిటీ నాలుగు ఓట్లా? ఉపకారాలు ఊరికే జేసావా అంటారా! ఈలోకంలో ఊరికే ఎవడేది చెయ్యడు. చంటిపిల్లాడైనా ఊరూరుకే ఏడవమన్నా ఏడవడు! కుప్పనూర్చే గొడ్డు రెండు గడ్డి పరకలు మేస్తాది. అది ధర్మంకూడా! అదెంత మాత్రం తప్పుకాదు."

రాజకీయాల్లో ఎదగాలంటే నాయకుడంటే భయమైనా ఉండాలి. భక్తి అయినా ఉండాలి. భక్తి ఉండేరోజులు కావివి. ఇక ఉంచుకోవాల్సింది భయమే! ఆ భయమే లేకపోతే ఇప్పుడు నాలుగు ఓట్ల మెజార్టీ వచ్చింది. వచ్చే ఎలక్షన్సులో నాలుగు ఓట్లు మాత్రమే పడతాయి. ఎందుకంటే పదవి మీద ఉన్నోడు పెంటమీద ఉన్నోడు ఒకటే. ఎప్పుడూ ఏదో ఒక కంపు కొడుతూనే ఉంటుంది. ఆ పరిస్థితి తెచ్చుకోకూడదని. పైగా కౌన్సిలర్‌గా గెల్చి నెలరోజులైనా జనాలు తనింటికి రావట్లేదు. ఇల్లు కిటకిటలాడట్లేదు. తనంటే వార్డులో జనాలు భయపడేలా చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. పనుల కోసం తనింటి చుట్టూ తిరిగేలా చెయ్యాలనుకున్నాడు.

గుంటెప్ప ఇంటికి నాలుగిళ్ళు అవతల రామ్మూర్తి ఇల్లుంది. అతను రిటైర్డు ఉద్యోగి. పెన్షనరీ బెనిఫిట్స్‌తో ఒక ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. ప్లానుకి అప్లికేషన్ పెట్టుకున్నాడు. ప్లాను వచ్చేలోపల ఒక మంచి ముహూర్తం కుదిరితే భూమి పూజ చేసుకొని పునాదులు తవ్వుకున్నాడు. మిగతా పని ప్లాను వచ్చేక ఆరంభిద్దామనుకున్నాడు.

ఈ సంగతి గుంటెప్పకు తెల్సింది. టౌను ప్లానింగ్ సెక్షన్‌కు వెళ్ళాడు.

"ఇంటిప్లాను ఎన్నాళ్ళలో సాంక్షను చెయ్యాలి" గుంటెప్ప అడిగాడు.

"పదిహేను రోజులు"

"రామ్మూర్తి ప్లాను పధ్నాలుగు రోజుల వరకు సాంక్షను చెయ్యకండి! పధ్నాలుగో రోజున ఏంచెయ్యాలో నేను చెబుతా"

"పధ్నాలుగు రోజులు ఎందుకు పెండింగ్ పెట్టారని కమీషనర్ అడిగితే?"

"పార్టీ కమీషనర్ దగ్గరకు వెళ్తేగదా మిమ్మల్ని అడిగేది. వాళ్ళు కమీషనర్ దగ్గరకు వెళ్ళకుండా నేన్జూసుకుంటాను. పార్టీయే వచ్చి అడిగారనుకొండి! "గుంటెప్ప చెప్పాడు. మీకేం భయం లేదు. ప్లాను వస్తుంది. ఇల్లు కట్టుకోమని అన్జెప్పండి" అన్నాడు గుంటెప్ప. అతని మాటల్లోని చిదంబర రహస్యం అర్థమైపోయింది. వాళ్ళ దగ్గరేదో ఇంత కతకడానికి ప్రయత్నిస్తున్నాడనుకున్నారు. కానీ గుంటెప్ప గుండె ఎంత లోతుందో వాళ్ళకేం తెలుసు.

ఒకరోజు సైటు దగ్గర రామ్మూర్తి ఉన్నాడు. గుంటెప్పే వెళ్ళి పలకరించాడు.

"ఏం రామ్మూర్తన్నా! ఇల్లు కట్టుకుంటున్నావ్"

"అవ్! గుంటెప్పా! రిటైర్‌మెంటు దుడ్లు వచ్చినాయ్! వాటితో కొంప ఒకటి నిలబెట్టుకుందామని" రామ్మూర్తి జవాబిచ్చాడు.

"అంతా బాగుందిగానీ; ఇల్లు మరీ చిన్నదౌతా ఉంది. ముంగలెందుకు అంత జాగా ఇడిస్తివి" గుంతలన్నీ పరికిస్తూ అన్నాడు గుంటెప్ప.

"ఏంజేస్తాం! సెంటున్నర జాగా! ముందల ఐదు అడుగులు ఇడచాల. సైటు క్రాసు ఉంది. సమంజేసుకొనే పాటికి మరో రెండడుగులు పోతాది. మొత్తం ఏడడుగులు ముందుకి వదలాల్సి వచ్చింది. లేపోతే ఈశాన్యం తక్కువబడ్తది" అంటూ వివరించాడు రామ్మూర్తి.

"ఓమాట జెప్పనా"

"చెప్పు గుంటెప్పా"

"నాకు ఓటెయ్యకపోయినా నా ఓటరువి నువ్వు. ఇప్పుడు గాపోతే మరో పాలి ఏస్తావ్. నీకైతే ఉపకారం జెయ్యాలగదా! ఏమంటావ్"

"దేవుడు వరమిస్తానంటే వద్దంటామా! చెప్పు ఏం ఉపకారం జేస్తావో"

"ముందు, వెనకా జాగా వదలడమంటే అది మన అనుకూలం బట్టి ఉంటాది. నువ్వు ఒక్క అడుగు కూడా వదలొద్దు"

రామ్మూర్తి ఏదో చెప్పబోతుంటే చెప్పనివ్వలేదు.

"నీ భయం నాకర్థమైంది. దాని గురించి తర్వాత చెబ్తాను. ఇకపోతే నీ సైటు క్రాసుంది. దాన్ని సమం జేసుకోవడానికి నీది రెండడుగులు వదలొచ్చు. పక్కనే రెండడుగులు కలుపుకోవచ్చు"

రామ్మూర్తి బాంబు పడినట్టు తుళ్ళిపడ్డాడు.

"పక్క జాగా మున్సిపాల్టీదికదా"

"అందుకే మరి కలుపుకోమంటున్నది. ప్రైవేటుదైతే ఒనరూరుకుంటాడేమి! రెండుకాకపోతే ఆరు కలుపుకొని నీ సైటు సమం జేసుకుంటే మరో గది ఈజీగా వస్తాది. నీకు తెలీంది ఏముంది. నోరులేని వెయ్యింగ్ మెషినైనా కడుపులో రూపాయిబిళ్ళ పడందే మన బరువెంతో చెప్పదు! ఉజ్జోగస్తులు! ఏదో ఆశపడ్తారు. కాస్త విదిలిస్తే వాళ్ళే వదిలేస్తారు. ఏమంటావ్" రామ్మూర్తి వెంటనే ఒప్పుకోలేకపోయాడు.

ఇంట్లో వాళ్ళతో చర్చించాడు. రామ్మూర్తికి భయంగా ఉంది. కానీ అతని కొడుకు దూకుడుగా ఉన్నాడు. గుంటెప్ప ఇప్పుడు చాలా పవర్‌ఫుల్‌గా ఉన్నాడని, అతనేం జెబితే అది మున్సిపాల్టీలో జరుగుతుందని అంచేత భయపడక్కర్లేదని తండ్రిని ఒప్పించేశాడు. దానికి సపోర్టుగా కొన్ని దృష్టాంతాలు గూడా చెప్పుకొచ్చాడు. రామ్మూర్తి తలొంచక తప్పలేదు.

పక్కనున్న మున్సిపాల్టీ జాగా కొంత ఆక్రమించుకొని ముందు మరో గదితో ఇల్లు చకచక లింటల్ వరకు వచ్చేసింది.

రామ్మూర్తి కొడుకు డబ్బులు తీసుకెళ్ళి మున్సిపాల్టీ వారికిచ్చాడు. "మీ కేసు గుంటెప్పగారు రికమెండేషన్ చేసారు.

అయినా మీ స్థలంలో మీరు ఇల్లుకుంటే మాకెందుకు లంచం" అని త్రిప్పి పంపించేశారు. ప్రక్కజాగా ఆక్రమించడం గురించి చెప్పాలను కున్నాడు రామ్మూర్తి కొడుకు. కానీ వాళ్ళు చెప్పనివ్వలేదు.

"అయ్యా! స్థలం మీది. ఒక అడుగు అటో, ఇటో అవుతుంది. అన్నం తింటే మెతుకులు రాలవా? కట్టుకుంటున్నావ్. కట్టుకో పైగా గుంటెప్ప చెప్పడు. పోఁ...పోఁ" అన్నారు.

"పోనీ ఒకసారి వచ్చి చూడండి!" అడిగాడు రామ్మూర్తి కొడుకు.

"గుంటెప్ప చెప్పిన తర్వాత ఇంక చూసేదేముందయ్యా!" అన్నారు.

ఇన్నిసార్లు గుంటెప్ప చెప్పాడు, గుంటెప్ప చెప్పాడని అనేసర్కి రెండడుగులు ఆక్రమణ గురించి చెప్పే ఉంటాడని మరింత ఉత్సాహంతో కట్టుబడి చకచక సాగిపోయింది.

ఒకరోజు సిమ్మెంటు బస్తాలకని రామ్మూర్తి కొడుకు ఆదోని వెళ్ళాడు. పెన్షన్ పేపర్స్‌లో సంతకాల కోసం రామ్మూర్తి కర్నూలు పోయాడు.

మిట్టమధ్యాహ్నం ఎండలు దంచేస్తున్నాయి. ఒక ట్రాక్టర్‌లో ఇరవైమంది వచ్చారు. ఎలుగ్గొడ్డు పుట్టమీద పడినట్టు వాళ్ళంతా రామ్మూర్తి ఇంటిమీద పడ్డారు. ఇంటిని పునాదుల్తోసహా పెకిలించి పారేశారు. రామ్మూర్తి భార్య, కోడలు కాళ్ళావేళ్ళా పడినా వినిపించుకోలేదు. ఇసుక గూడు కాళ్ళతో తన్ని విరగ్గొట్టినట్టు, అర్ధ గంటలో అంతా ధ్వంసం చేసేశారు. లింటల్ వరకొచ్చిన ఇల్లు నేలమట్టమైపోయింది.

సాయంత్రం ఇంటికొచ్చిన రామ్మూర్తికి అది కలో నిజమో అర్థంకాలేదు. గంట వరకు తేరుకోలేకపోయాడు. వెంటనే గుంటెప్ప ఇంటికి పరుగెత్తు కొచ్చేడు.

గుంటెప్ప ఏదో శిక్షణ కొరకు హైదరాబాదు వెళ్ళాడని చెప్పారు. ఏంచెయ్యాలో పాలుపోక కమీషనర్ దగ్గరకు పరుగెత్తాడు.

కమీషనర్ సిబ్బందిని పిలిపించాడు.

జరిగిందంతా ఏడ్చుకుంటూ చెప్పాడు రామ్మూర్తి. దానికి ధీటుగా సిబ్బంది కూడా చెప్పారు.

"స్సర్ రూల్సు ప్రకారం లేనప్పుడు ప్లాను రిటర్న్ చెయ్యాలికదా" అన్నాడు కమీషనర్.

"చేశాం సార్" అక్‌నాలెడ్జ్‌మెంటు కూడా చూపించారు.

గుండె లబోదిబోమని బాదుకున్నాడు రామ్మూర్తి. దానిమీది సంతకం తనదిలాగా ఉందేకానీ తనదికాదు.

"ముందు, జాగా వదల్లేదనుకోండి. పెనాల్టీ కట్టించుకొని రెగ్యులరైజ్ చెయ్యొచ్చుకదా! డెమాలిష్ ఎందుకు చేసారు" మళ్ళీ అడిగాడు కమీషనర్.

"వాళ్ళ స్థలమైతే రెగ్యులేట్ చెయ్యొచ్చు! మన స్థలాన్ని ఎంక్రోచ్ చేసారే! చూస్తూ ఊరుకుంటే మా ఉద్యోగాలు పోతాయి" అన్నారు సిబ్బంది.

"సర్ నాదగ్గర డెమాలిషన్ ఆర్డర్స్ తీసుకున్నారా"

"మీటింగ్‌కి వెళ్తున్నప్పుడు అడిగాంకదాసార్! ఎంక్రోచ్‌మెంటు అయితే ముందు తీసెసెయ్యండి! తర్వాత ఆర్డర్స్ తీసుకొండని మీరే అన్నారు సార్"

"అది ఇదా!" ఆశ్చర్యపోవడం కమీషనర్ వంతయ్యింది.

"తీసేసేదేదో ఎంక్రోచ్‌మెంటు వరకు తీసెయ్యాలిగానీ మొత్తం ఎలా తీసేస్తారయ్యా?" మండిపడ్డాడు కమిషనర్!

"నిజమేసార్! ఏడడుగులు ఎంక్రోచ్‌మెంటుంది. వర్కర్సు కదా సార్! చదువు రానిమొద్దు నాయాండ్లు! మరో రెండడుగులు ఎక్కువ కొట్టేశారు"

"కాదు. నాది ఏడడుగులు. మీది రెండు అడుగులే" అని గట్టిగా అరవాలనుకున్నాడు. కానీ పరాయి స్థలానికి ఆశపడిన స్వార్థం అతని గొంతును పలకనివ్వలేదు.

గుంటెప్ప హైదరాబాదు నుండి వచ్చీరాగానే, రామ్మూర్తి ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో అందరూ గుంటెప్పను పట్టుకొని ఏడ్చారు. మున్సిపాల్టీవారిని లోకంలో లేని తిట్లన్నీ తిట్టాడు.

"ఆనా కొడుకులకి ఏదో కొంత పడెయ్యమన్నాను. ఇవ్వలేదా" ఏమీ తెలీనట్టు అడిగాడు గుంటెప్ప.

"ఇచ్చాను. రెండుసార్లు ఇచ్చాను. రెండుసార్లు వద్దన్నారు. పైగా మీ స్థలంలో మీరు కట్టుకుంటుంటే మాకు లంచమెందుకన్నారు" చెప్పాడు రామ్మూర్తి కొడుకు.

"మరక్కడే ఉంది మడతపేచీ. వాళ్ళేమన్నారు. మీచోట్లో మీరు కట్టుకుంటే మాకు లంచం వద్దన్నారు. మనచోట్లో మనం కట్టలేదే. మున్సిపాల్టీ మట్టెలోకి వెళ్ళాంకదా!

"నువ్వు చెప్పలేదా అన్నా." అంది రామ్మూర్తి భార్య నోటికడ్డం పెట్టుకున్న చీరచెంగు తీయకుండానే.

"చెప్పానమ్మా చెప్పాను. అన్నీ చెప్పాను. ఇదెలా మర్చిపోయానో ఈ రెండడుగుల సంగతి మర్చిపోయాను. మీరు వాళ్ళకేదో పడేస్తే ఏ బాధా లేకపోయేది" అన్నాడు నిష్ఠూరంగా తప్పంతా వాళ్ళదేనన్నట్టు.

రామ్మూర్తి వృధా అయిపోయిన డబ్బుని తల్చుకుంటూ బిక్కసచ్చిపోయి గోడకు అతుక్కుపోయాడు మాటాపలుకు లేకుండా!

అప్పటికే ఆ వార్డులోని జనాలు ఒక అరవైడబ్బయి మందిదాకా అక్కడ గుమిగూడారు. అదే మంచి అదనుగా భావించి గుంటెప్ప చెప్పడం ప్రారంభించాడు.

"రామ్మూర్తి అన్నా! నువ్వేమీ ఇదవ్వకు. పోయింది పొల్లు. ఉన్నది గట్టి. ఎవరికెంత ప్రాప్తమో అంతే! మీ ఇంటిల్లపాది నాకు ఓట్లేసి ఉంటే, ఎనిమిది ఓట్లుతో గెలిచేవాడ్ని! కానేం జేస్తాం! నాలుగు ఓట్లతోనే గెలవాలని నాకు రాసిపెట్టి ఉంది. అన్నిటితోనే గెల్చాను. అందరికి మళ్ళీ ఎలక్షన్సులో దేవుడం మంచిబుద్ధి ఇస్తే, ఐదొందల ఓట్లతో గెలుస్తాను. ఏవంటావు? అలాగే నాకు మంచిబుద్ధి ఇస్తే మరో దాంట్లో నీకు తప్పకుండా ఉపకారం చేస్తాను. అయితే రెండ్రోజులకొకసారైనా మా ఇంటికొచ్చి నువు కనబడుతుండు. ఏమంటావు? ఏటి నోరు పడిపోయినట్లు మాట్లాడవేమన్నా! సరే దుఃఖంలో ఉన్నట్టున్నావు. నేను వెళ్తాను మరి! అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. నాతో పోటీచేసి ఓడిపోయాడే కామేశం గాడూ- ఆనాకొడుకు వార్డులో తప్పుడు కూతలు కూస్తున్నాడట- నేనే నాటకమాడి, ఇల్లు పడగొట్టించానని- నాకు ఓట్లు వెయ్యకపోతే ఎంతకైనా తెగిస్తానని, వార్డులో బతకనివ్వనని, ఇంక ఏవేవో మిమ్మల్ని భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. వాడి మాటలు నమ్మకండి. అయితే ఒక్కటి మాత్రం నిజం. అదేమిటంటే- దేవుడంతటివాడే నచ్చినోళ్ళకు వరాలు- నచ్చనోళ్ళకు శాపాలు ఇస్తుంటాడు. నేనెంత మానవ మాత్రుడ్ని. అలాగని రామ్మూర్తి ఇల్లు నేను కావాలని పడగొట్టానని అనుకోవద్దు- అని అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఇహ జూస్కోండి మర్నాడు నుండి గుంటెప్ప ఇంటిముందు తిరునాళ్ళే. ●



## అవగాహన ఆనందానికి మూలం

సామరస్యం, సమభావం, సర్దుబాటు ధోరణి ఉన్నవారే శృంగారంలో ఆనందం పొందుతారు. తాము సౌఖ్యాన్ని పొందుతూ ఎదుటివాళ్ళకు సౌఖ్యాన్నందిస్తారు. ఆధిక్యతా భావం, అహంకారం, తమ ఇష్టమే నెగ్గాలన్న రీతిన పంతం పట్టే ధోరణితో ఉన్నవారు సెక్స్‌ను ఎంజాయ్ చేయలేరు. కనుక మీ మధ్య సంబంధాల్లో స్పష్టత ముఖ్యం. అదెలా సాధ్యమంటారా?

* మీ జీవన విధానంలో పరస్పర గౌరవం, ప్రేమకు స్థానముండాలి. ఎదుటివాళ్ళ అభిప్రాయాల్ని ఓపికగా వినాలి. మీకు నచ్చని విషయాల గురించి సామరస్యంగా చెప్పాలి.

* ఎదుటివాళ్ళ ఇష్టాలు మీకు నచ్చకపోవచ్చు. అందుకని వాటిని మానాల్సిందే అని పట్టుబట్టకూడదు. మీ సెక్సువల్ లైఫ్‌కు ఆటంకం కానంతవరకు వారి ఇష్టాల్ని మన్నించవచ్చు.

కొందరు మందుకొట్టాక సెక్స్ చేయాలనుకుంటారు. వాని ఆ వాసనే గిట్టదనే భార్యను బలవంతంగా దగ్గరికి తీసుకోవడం వల్ల ఫాయిదా ఏమిటి? సెక్స్ ఏకపక్షం కాదు. మీ స్పర్శకు ఎదుటివాళ్ళు స్పందిస్తేనే ఆనందం రెట్టింపవుతుందని గుర్తు పెట్టుకోండి.

* ఒకతను గుట్కాకు బాగా అలవాటు పడ్డాడు. గుట్కా తినకుండా ఉండలేడు. దాంతో అతని దంతాలు తెలుపుదనాన్ని కోల్పోయాయి. అతని నవ్వు భార్యకు వికృతంగా కనిపిస్తుంది. అతను ముద్దు పెట్టుకున్నా కంపరమెత్తుతుంది. గుట్కా మానితే తప్ప తన పక్కన పడుకోవద్దని గట్టిగా చెప్పిందామె. ఇలాంటి భయంకరమైన అలవాట్లు శృంగార జీవితాన్ని దెబ్బతీస్తాయి. కనుక ముందూ జాగ్రత్తపడాలి. దురలవాట్లకు దూరంగా ఉండాలి.

* కొందరు మాట్లాడుతుంటే అరుస్తున్నట్టుగా వుంటుంది. అలాంటివారు శృంగార వేళ రసరమ్యమైన రీతిన గుసగుసలు పోవడమెలా సాధ్యం? ఆవేశాన్ని పక్కనపెట్టి నింపాదిగా మాట్లాడే ధోరణి అలవరచుకుంటేనే శృంగారంలో అందం, ఆనందం.

* అహంకారం శృంగారంలో ఆనందానికి గొడ్డలిపెట్టు. 'ఆడదానికేం తెలుసు' అని చిన్న చూపు చూస్తూ అదిలించే ధోరణితో మాట్లాడే మగాడితో అనురాగంతో ఏ స్త్రీ వ్యవహరించలేదు. ఇక హాయిగొలిపే శృంగారానికి తావెక్కడ?

* నిస్సంకోచంగా నిర్భయంగా ఏ శషభిషలు లేకుండా మనసులోని మాటని చెప్పుకునేవాళ్ళు, తమ స్వైర కల్పనల్ని విప్పి చెప్పుకునేవాళ్ళు శృంగారాన్ని బాగా ఎంజాయ్ చేస్తారు. అందుకే ఒకరిపట్ల ఒకరికి ప్రగాఢమైన ఇష్టం, ప్రేమ, గౌరవం ఉండాలి. అలాంటివారే శృంగార జలధిన ఆనందంగా ఈదులాడుతారు.

– ప్రణవ



2